సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 28 । డిసెంబర్ । 2023



కప్ప చేప

విశాఖ: ఉప్పాడ మత్స్యకారుల వలకు బుధవారం అరుదైన సముద్రజీవి కప్ప చేప చిక్కింది. దీనిని మళ్లీ సముద్రంలో వదిలేశారు.



హుండీ ఆదాయం లెక్కింపు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి హుండీ ఆదాయం గడిచిన 30 రోజులకు రూ.2,06,69,033 వచ్చింది.



'ప్రకృతి వనం' ప్రారంభం

విశాఖ: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–1లో ప్రకృతి వనం పార్కును స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ బుధవారం ప్రారంభించారు.

న్యూస్‌రీల్

పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి బాధ్యతల స్వీకరణ



మోదకొండమ్మతల్లికి పూజలు చేస్తున్న చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివ కిషోర్, పాడేరు సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి దంపతులు



బాధ్యతలు స్వీకరిస్తున్న ధాత్రిరెడ్డి

సాక్షి,పాడేరు: పాడేరు సబ్ కలెక్టర్‌గా పెద్దిటి ధాత్రిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆమె భర్త చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివ కిషోర్ కలిసి స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దంపతులను ఘనంగా సత్కరించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ధాత్రిరెడ్డి శిక్షణ అనంతరం అనకాపల్లి జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించిన పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి నాగరాజు, పలువురు తహసీల్దార్లు, సిబ్బంది ఆమెను అభినందించారు.

రెండో రోజు క్రీడా సందడి



పాడేరు మండలం వంతాడపల్లి మైదానంలో క్రికెట్ ఆడుతున్న గిరిజన యువకులు

సాక్షి,పాడేరు: ఆడుదాం ఆంధ్రాతో జిల్లా వ్యాప్తంగా రెండవ రోజు క్రీడా సందడి నెలకొంది. 22 మండలాల పరిధిలో 352 గ్రామసచివాలయాల్లో క్రీడా పోటీలు బుధవారం కూడా విజయవంతంగా నిర్వహించారు. క్రికెట్‌తో పాటు పలు చోట్ల నిర్వహించిన వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కూడా యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామసచివాలయ ఉద్యోగులు క్రీడా పోటీలను పర్యవేక్షించారు.

డోలీలో గర్భిణి తరలింపు



డోలీలో గర్భిణిని మోసుకువెళ్తున్న గిరిజనులు

అనంతగిరి: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని అటవీప్రాంతం గుండా డోలీలో మోసుకుని ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మారుమూల పెదకోట పంచాయతీ మద్రేబ్ గ్రామానికి చెందిన కె.రాధ(35) నిండు గర్భిణి. ఆమెకు నెలల నిండడంతో బుధవారం ఉదయం తెల్లవారుజామున పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో భర్త లక్ష్మణరావు కుటుంబ సభ్యుల సాయంతో ఆమెను అటవీ ప్రాంతం గుండా సుమారు ఐదు కిలోమీటర్లమేర డోలీలో మోసుకుని దాయర్తి గ్రామానికి తీసుకువచ్చారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో పినకోట పీహెచ్‌సీకి తరలించారు. ఆమె మగశిశువుకు జన్మనిచ్చింది.

వాలీబాల్ క్రీడాకారుడికి అభినందన



ప్రకాష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఏటీడబ్ల్యూవో తదితరులు

కొయ్యూరు: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో నిర్వహించిన అండర్ 14 విభాగం వాలీబాల్ పోటీల్లో డౌనూరు ఆశ్రమ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి గెమ్మెల ప్రకాష్ ప్రతిభ కనబరిచాడు. అతను పాల్గొన్న రాష్ట్ర జట్టు తృతీయ స్థానంలో నిలిచిందని ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అతనిని ఎంఈవో ఎల్.రాంబాబు, హెచ్‌ఎం ప్రభుదాస్,డౌనూరు సర్పంచ్ పొట్టిక భవాని, ఎంపీటీసీ బి.అప్పారావు అభినందించినట్లు ఆయన తెలిపారు.

ఆదివాసీలకు అనుగృహం



జి.మాడుగుల మండలం పాలమామిడిలో పెంకుల ఇల్లు



వచనరంగిలో సర్వే నిర్వహిస్తున్న గృహనిర్మాణశాఖ అధికారులు

ఆదివాసీ గిరిజనులకు సొంతిల్లు సమకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. వచ్చే నెలలో ఈ ప్రక్రియ కార్యరూపం దాల్చనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అర్హులనుంచి గుర్తించిన రాష్ట్ర గృహనిర్మాణశాఖ అధికారులు లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నిమగ్నమయ్యారు.

- సొంతిళ్లు సమకూర్చనున్న కేంద్ర ప్రభుత్వం
- రాష్ట్ర ప్రభుత్వ నివేదికకు త్వరలో కార్యరూపం
- 1478 గ్రామాల్లో 31,674 మంది అర్హులుగా గుర్తింపు
- లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో నిమగ్నమైన గృహనిర్మాణశాఖ యంత్రాంగం

సాక్షి, పాడేరు: గిరిశిఖర గ్రామాలకు పరిమితమైన జిల్లాలోని ఆదివాసీ (పీవీటీజీ) గిరిజనులకు సొంతిల్లు కల నెరవేరనుంది. పక్కాగృహాలకు నోచుకోని వీరికి పెద్ద మొత్తంలో ఆర్థికసాయం అందించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం గతంలో నివేదించింది. ఈ మేరకు వచ్చే నెలలో ప్రారంభం కానున్న పీఎం జన్‌మన్ పథకంలో సొంతిల్లు నిర్మాణం కార్యరూపం దాల్చనుంది.

జిల్లాలోని 21 మండలాల్లో..

దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించే లక్ష్యంగా వచ్చేనెల 15వ తేదీన పీఎం జనమన్ (ప్రధానమంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకాన్ని పీఎం ప్రారంభించనున్నారు. ఈ పథకంలో ఆదివాసీలకు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు గృహనిర్మాణశాఖ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. జిల్లాలో ఎటపాక మినహా మిగతా 21 మండలాల్లో దీన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా గృహనిర్మాణ సంస్థ అధికారులు, సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇల్లు లేదని ఆదివాసీ కుటుంబాలను గుర్తించి వారి వివరాలను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. పీఎం జన్‌మన్ పథకంలో ఒక్కొక్క ఇంటికి కేంద్ర ప్రభుత్వం రూ.2.39 లక్షలు అందించనుందని వారు పేర్కొన్నారు.

31,674 కుటుంబాలకు అవకాశం

జిల్లాలోని 21మండలాల్లోని 276 పంచాయతీల పరిధిలో 1478 గ్రామాల్లో నివసిస్తున్న ఆదివాసీ కుటుంబాల్లో అర్హత గల 31,674 మందికి పక్కా ఇళ్లు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక రూపొందించింది. అనంతగిరి మండలంలో 396, అరకులోయలో 1592, డుంబ్రిగుడలో 955 ,పెదబయలులో 2579, ముంచంగిపుట్టులో 3770, హుకుంపేటలో1654 మందికి ఇళ్లు అవసరమని పేర్కొంది. పాడేరు మండలంలో 2029, జి.మాడుగులలో 2186, చింతపల్లిలో 3582, జి.కే.వీధిలో 3577, కొయ్యూరులో 2295, దేవీపట్నంలో 349, మారేడుమిల్లిలో 1495, రంపచోడవరంలో 667, వై.రామవరంలో 1402, అడ్డతీగలలో 813 మంది అర్హులను గుర్తించారు. గంగవరం మండలంలో 260, రాజవొమ్మంగిలో 929, చింతూరులో354, కూనవరంలో266, వీఆర్‌పురం మండలంలో 524 మంది ఆదివాసీలకు కేంద్ర ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయనుందని అధికారవర్గాలు తెలిపాయి.

80 శాతం రిజిస్ట్రేషన్ పూర్తి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణాలకు అర్హులైన ఆదివాసీ కుటుంబాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈనెలాఖరుకు పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నాం. తమ సిబ్బందితో పాటు సచివాలయాల అసిస్టెంట్లు ఆదివాసీ గ్రామాలను సందర్శించి వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే 80శాతం రిజిస్ట్రేషన్ పూర్తి చేశాం.

– బాబునాయక్, ఇన్‌చార్జి పీడీ, గృహనిర్మాణసంస్థ, పాడేరు

సమ్మె చేస్తామనడం అవాస్తవం

- కొన్ని పత్రికలు, చానళ్ల తప్పుడు ప్రచారం
- గ్రామ వలంటీర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మా రాంబాబు, కార్యదర్శి కొండబాబు



కొమ్మా రాంబాబు, కొండబాబు

పాడేరు : ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె, ధర్నాలు, ఎటువంటి ఆందోళన కార్యక్రమాలు చేయడం లేదని గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మా రాంబాబు, కార్యదర్శి కొండబాబు స్పష్టం చేశారు. బుదవారం వారు పాడేరులో విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ అనేక సేవలు అందిస్తోందన్నారు. ఈ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు జరుగుతున్న మేలును చూసి ఓర్వలేక కొన్ని రాజకీయ పార్టీలు ఇటువంటి అసత్యాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. తాము సమ్మెకు దిగుతామని, సమ్మె చేస్తున్నామని నిరాధారమైన వార్తలు ప్రచురించడాన్ని విరమించాలని హితవు పలికారు. తమ సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, ఆయనపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. అటువంటి పరిస్థితుల్లో తాము సమ్మెలు, ఆందోళన కార్యక్రమాలు ఎందుకు చేస్తామని ప్రశ్నించారు. దయచేసి ఇకనైనా కొన్ని రాజకీయ పార్టీల నాయకులు, కొన్ని పత్రికలు, టీవీ ఛానళ్ల అసత్య ప్రచారాలు విరమించాలని వారు సూచించారు.

పచ్చమీడియా ఈనాడు కుట్ర

హుకుంపేట : జీతాలు పెంచాలని వలంటీర్లు సమ్మె చేస్తున్నట్లు ఇటీవల ఈనాడు పత్రికలో వచ్చిన కథనం అవాస్తవమని, ఇదంతా పచ్చమీడియా కుట్ర అని వలంటీర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బర్లు కొండబాబు, మండల శాఖ అధ్యక్షుడు మీసాల రవితేజ అన్నారు. అవాస్తవ కథనాలు ప్రచురించిన పత్రికలకు వ్యతిరేకంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్ల అసోసియేషన్ సభ్యులు, పలువురు వలంటీర్లు మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు జరుగుతున్న మేలును చూసి తట్టుకోలేకనే పచ్చమీడియా అవాస్తవ కథనాలను ప్రచురిస్తుందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశంలోనే గుర్తింపు పొందిందన్నారు. గౌరవంతోపాటు ఉపాధి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ నినాదాలు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పుడు కథనాలు ప్రచురిస్తే తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల అసోసియేషన్ సభ్యులు ముసిరి భవాని శంకర్, గబ్బడ శ్రీను, అప్పలరాజు, శాంతికుమారి, భాగ్యశ్రీ పాల్గొన్నారు.



హుకుంపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు

చిరుధాన్యాల వంటకాలతో ఆర్థికాభివృద్ధి

ఐకేపీ ఏపీడీ శ్రీనివాస్



చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు



బహుమతులు అందజేస్తున్న కేవీకే కోఆర్డినేటర్ లలితా కామేశ్వరి తదితరులు

రంపచోడవరం: చిరుధాన్యాల్లో మంచి పోషక విలువలు ఉంటాయని వాటితో వివిధ రకాలైన వంటకాలు తయారు చేసి విక్రయించడం ద్వారా గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఐకేపీ ఏపీడీ శ్రీనివాస్ అన్నారు. పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం మహిళలకు చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల తయారీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీవో సంధ్యారాణి మాట్లాడుతూ చిరుధాన్యాలతో వంటకాలు చేసుకుని వాటిని తినడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చన్నారు. రాగి లడ్డూ, కొర్ర లడ్డూ, రాగి పాయసం, రాగిమాల్ట్ చిరుధాన్యాలతో రుచికరంగా చేసుకోవచ్చన్నారు.

కేవీకే కోఆర్డినేటర్ డా. లలితాకామేశ్వరి మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా 2023ని గుర్తించడం జరిగిందన్నారు. 350 మంది రైతులకు రాగులు, కొర్రల విత్తనాలు ఇచ్చామన్నారు. వీటిలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ కావాల్సిన సామగ్రి మహిళలకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. రుచికరంగా చేసిన వంటకానికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డా. చిరంజీవి, వీరాంజనేయులు, ఆర్ ప్రవీణ్‌బాబు, డా. రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం, రాగుల సేకరణ వేగవంతం

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: ధాన్యం, రాగుల సేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ అధికారులు, తహసీల్దార్లతో బుధవారం నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. పాడేరు డివిజన్‌లో రాగులు, రంపచోడవరం డివిజన్‌లో ధాన్యం సేకరణపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు, గ్రామ సచివాలయాల్లోని వ్యవసాయ, ఉద్యానవనశాఖ సిబ్బంది గ్రామాల్లో రైతులకు ముందుగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం అమలుజేస్తున్న గిట్టుబాటు ధరలపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ధాన్యం, రాగుల పంట కొనుగోలు చేసిన వెంటనే ఎఫ్‌టీవోలు జనరేట్ చేసి వారం రోజుల్లోగా ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేయాలని ఆదేశించారు.

కలెక్టర్‌తో మార్క్‌ఫెడ్ ఎండీ భేటీ



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్‌పాండే



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పాడేరు సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి

సాక్షి,పాడేరు: కలెక్టర్ సుమిత్‌కుమార్ మార్క్‌ఫెడ్ ఎండీ, మార్కెటింగ్‌శాఖ కమిషనర్ రాహుల్‌పాండేతో బుధవారం భేటీ అయ్యారు. జిల్లాలో మార్కెటింగ్, రవాణా సదుపాయాలు, మౌలిక వసతులు, వాణిజ్య పంటల సాగు విస్తరణ, కూరగాయలు, పండ్లకు ఉన్న డిమాండ్, సరఫరా, ధరలు, ధాన్యం సేకరణ, రైతులకు నగదు చెల్లింపులు తదితర అంశాలపై చర్చించారు.

కలెక్టర్‌ను కలిసిన సబ్ కలెక్టర్

కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను పాడేరు సబ్‌కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి బుధవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క కుండీని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు అభినందనలు తెలిపారు. పాడేరు డివిజన్‌లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ఓటరు జాబితా సవరణలో భాగంగా పాడేరు నియోజకవర్గంలో అందిన విజ్ఞప్తులపై ప్రత్యేకంగా దృష్టిసారించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు.

మారేడుమిల్లి పోలీసుస్టేషన్ తనిఖీ



పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

మారేడుమిల్లి : అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి అన్నారు. బుధవారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాకు ఎప్పటికప్పుడు అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. రిసార్ట్స్, కాటేజీలు నిబంధనలకు అనుగుణంగా నడపాలని సూచించారు. అనంతరం వృద్ధులు, పేదలకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్‌ఐ రాము పాల్గొన్నారు.

గెడ్డలో గల్లంతైన వ్యక్తి మృతి

- పీతలను వేటాడుతుండగా ప్రమాదం
- గజ ఈతగాళ్లతో గాలింపు
- మృతదేహం లభ్యం



లభ్యమైన రవికుమార్ మృతదేహం

హుకుంపేట: పీతలను పట్టేందుకు వెళ్లిన వ్యక్తి గెడ్డలో గల్లంతై మృతి చెందాడు. బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రం హుకుంపేట సమీపంలోని చీడిపుట్టు గెడ్డపై నిర్మిస్తున్న వంతెన ప్రాంతంలో పీతలు పట్టేందుకు బూరపల్లి గ్రామానికి చెందిన జోనంకి రవికుమార్(30), మరో ఇద్దరితో కలిసి వెళ్లాడు. గెడ్డలో పీతలు పడుతుండగా రవికుమార్ మునిగిపోయాడు. మిగతా ఇద్దరు అతనిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సతీష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పాడేరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు స్థానిక గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు బుధవారం రాత్రి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని స్థానికులు తెలిపారు.

వ్యక్తి మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి గెడ్డలో పీతలు పట్టేందుకు బుధవారం సాయంత్రం వెళ్లాడు. పీతలు పడుతున్న సమయంలో ప్రమాదవశత్తు గెడ్డలో మునిగిపోయాడని తనతో ఉన్నవారు తెలిపారు. రవికుమార్‌కు ఈత కూడ రాదని తనను కాపాడేందుకు ప్రయత్నించిన సరే ఫలితం లేకపోయిందని అప్పటికే గెడ్డలో మునిగిపోయాడని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై సతీష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పాడేరు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది స్థానిక ఈత గాళ్ళతో గెడ్డలో దిగి ముమ్మరంగా గాలింపు చర్యలు చేట్టడంతో బుధవారం రాత్రి మృత దేహం లభ్యమైంది. మృతి చెందిన వ్యక్తికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

సివిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే, వేదికపై డీఎఫ్‌వో, సబ్ కలెక్టర్ తదితరులు



శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: గిరిజన యువతకు ఉన్నత ఉద్యోగ అవకాశాలు లక్ష్యంగా సివిల్ సర్వీసెస్, గ్రూప్–1, గ్రూప్ –2 పోటీ పరీక్షలకు ఇస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని డీఎఫ్‌వో జీజీ నరేంద్రియన్, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ తొమ్మిది నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణకు అవసరమైన మెటీరియల్‌ను చెన్నై నుంచి డీపీవో తీసుకువచ్చే ఏర్పాట్లు చేశారన్నారు. శిక్షణ కాలంలో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే అభ్యర్థులు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సివిల్ సర్వీసెస్, గ్రూప్– 1, గ్రూప్–2 శిక్షణ 21ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ సొసైటీ కె.ధరణి, కోఆర్డినేటర్ బీవీఏ శ్రీకాంత్ శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణకు ఐదుగురు సిబ్బందిని నియమించినట్టు చెప్పారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ కోచింగ్ ఎంతో ఖర్చుతో కూడినదన్నారు. ప్రభుత్వమే ఉచితంగా అందించడం వల్ల శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు ఎంతో అదృష్టవంతులన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ తొమ్మిది నెలల పాటు పూర్తిస్థాయిలో శిక్షణ పొందేందుకు అభ్యర్థులు సిద్ధం కావాలన్నారు. ప్రతిరోజు పది గంటలకు పైబడి చదవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో (జనరల్) సీహెచ్ శ్రీనివాసరావు, యూత్ ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కోర్సు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం (విశాఖ): పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశం కల్పించే బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ) ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. జనవరి 2 నుంచి 31 వరకు బ్రిడ్జి కోర్సు ట్రైనింగ్ ప్రోగ్రాం ఉంటుందన్నారు. ఈ నెల 31లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ట్రైనింగ్ ఆఫీసర్ సిహెచ్.లలిత కుమారి(కోపా ట్రేడ్) కంచరపాలెం పాత ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు

చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



రైతులతో మాట్లాడుతున్న పీవో చైతన్య

చింతూరు: రైతులు పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు అమ్మి మోసపోవద్దని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సూచించారు. బుధవారం ఆయన చింతూరులోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల మేలుకోసం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు మంచి గిట్టుబాటు ధర కల్పిస్తోందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని నేరుగా కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించడం ద్వారా మంచి ధర పొందే అవకాశముందని ఆయన తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా రైతుల ధాన్యాన్ని కచ్చితంగా తూకం వేయాలని, ధాన్యాన్ని విక్రయించిన రైతులకు తప్పనిసరిగా స్లిప్పులు ఇవ్వాలని పీవో ఆదేశించారు. ఈ ఏడాది ధాన్యం దిగుబడుల వివరాలను ఆయన రైతులనుంచి తెలుసుకున్నారు. ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటోలో 88 కిలోల గంజాయి పట్టివేత

● ఐదుగురు అరెస్టు



పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

కొయ్యూరు : చీడిపాలెం జంక్షన్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఆటోలో ఒడిశా నుంచి తుని తరలిస్తున్న 88 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు ఎస్ఐ రాజారావు తెలిపారు. మంప ఎస్ఐ లోకేష్‌కుమార్‌తో కలిసి తనిఖీలు చేస్తుండగా ఆటోలో 88 కిలోల గంజాయి బయటపడిందన్నారు. జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ చింతగుప్పకు చెందిన పాంగి బీమబాబు, కొర్రా మోసే, పెదబయలు మండలం చింతగరువుకు చెందిన కొర్రా లక్ష్మణ్, జి.మాడుగుల మండలం సాడేకు పంచాయతీ కక్కపల్లికి చెందిన వంతల మోహన్‌రావు, చింతపల్లి మండలం బలపం పంచాయతీ మూల కొత్తూరుకు చెందిన పూజారి బాలకృష్ణను అరెస్టు చేశామన్నారు. ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా గంజాయి నిర్మూలన చేపట్టామ ఎస్ఐ పేర్కొన్నారు.

తూనికలు, కొలతల శాఖ అధికారి తనిఖీలు



సంతను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కంట్రోలర్ రమణమూర్తి

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ వారపు సంతలో బుధవారం తూనికలు కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రమణమూర్తి తనిఖీలు నిర్వహించారు. సీలు లేని కాటాలు వినియోగిస్తున్న ఐదుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. కొనుగోలు చేసేటప్పుడు తూకం సరిగ్గా ఉందా లేదా అనేది పరిశీలించుకోవాలని ఆయన వినియోగదారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకుల ఫిర్యాదు మేరకు బొర్రా గుహల వద్ద శీతల పానీయాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, అధిక ధరలకు విక్రయిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలుర పాఠశాలలో 9,10 వతరగతి విద్యార్థులకు తూనికలు, కొలతలు, మోసాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం అధికారిణి అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

మూడో గురువారం పూజలకు ఏర్పాట్లు

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవ మూడో గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, రీడింగ్ రూమ్ ఎదురుగా ఉన్న రోడ్డులో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. మంచినీటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. పలు దేవాలయాల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకొచ్చామని, ఆలయ పరిసర ప్రాంతమంతా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా జీవీఎంసీ సహకారం తీసుకున్నట్లు తెలిపారు. కాగా.. రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500 క్యూ టికెట్లు ఇస్తారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించనున్నారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం(వీటీ కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్న దృష్ట్యా ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు. జగదాంబ జంక్షన్ మీదుగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు నుంచి టౌన్‌కొత్తరోడ్డు ముందు సందు వద్ద కుడివైపు తిరిగి సూయిజ్‌ఫాం చేరుకోవాలి.



ప్రత్యేక పూజలో సిరులతల్లి

అక్కడే వాహనాలు పార్కు చేసి కాలి నడకన అమ్మవారి గుడికి రావాలి.

- కాన్వెంట్ జంక్షన్, అద్వానీ జంక్షన్, రామకృష్ణ జంక్షన్ మీదుగా వచ్చే వాహనాలు సీహార్స్ జంక్షన్ నుంచి టౌన్‌కొత్తరోడ్డు ముందు పార్కింగ్ చేసుకుని కాలినడకన రావాలి.
- వన్‌టౌన్, పాత పోస్టాఫీస్ జంక్షన్ల మీదుగా అమ్మవారి గుడికి వచ్చే ద్విచక్ర వాహనచోదకులు లక్ష్మీటాకీస్, ఎంవీడీఎం హైస్కూల్ మీదుగా కురుపాం మార్కెట్ మెయిన్‌రోడ్డు కిరువైపులా పార్క్ చేసుకోవాలి.
- వన్‌టౌన్, పాత పోస్టాఫీస్ జంక్షన్లు మీదుగా అమ్మవారి ఆలయానికి వచ్చే నాలుగు చక్రాల వాహనదారులు కురుపాం మార్కెట్‌లోని ఖాళీ స్థలంలో పార్క్ చేసుకోవాలి.
- వీఐపీలు, రూ.500 టికెట్ తీసుకునే వారు బీచ్ రోడ్డు మీదుగా టౌన్ హాల్‌కు చేరుకుని.. అక్కడే తమ వాహనాలను పార్క్ చేసుకోవాలి.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనాలంటే భక్తులు రూ.7,500 చెల్లించాల్సి ఉంటుందని ఈవో తెలిపారు. టౌన్‌కొత్తరోడ్డు సమీపంలోని జగన్నాథస్వామి ఆలయంలో మూడు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఏఈవో కె.తిరుమలేశ్వర రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు

- రెండేళ్లుగా తగ్గుతున్న కేసులు
- పోలీస్ శాఖ చర్యలతో సత్ఫలితాలు
- వార్షిక సమీక్ష సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

విశాఖ సిటీ: జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పోలీసుశాఖ తీసుకున్న చర్యల ఫలితంగా దాదాపు రెండేళ్లుగా కేసులు తగ్గుతూ వస్తున్నాయని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జిల్లా స్థాయి వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీలు కె.శ్రీనివాసరావు, పి.వెంకటరత్నం, కె.ఆనంద్ రెడ్డి, ఇతర రెవెన్యూ, జ్యుడీషియల్, పలు శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి కమిటీ సభ్యుల సూచనల మేరకు పోలీసు శాఖ తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాలపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలతో ప్రజలు, కళాశాల విద్యార్థుల్లో చైతన్యం వస్తోందన్నారు. వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, పోలీసు శాఖల సహకారంతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రమాదాల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టినట్లు చెప్పారు.

జిల్లాలో గట్టి నిఘా : సీపీ రవిశంకర్

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి నిఘాతో పాటు పటిష్ట చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. నగర పోలీసు అధికారులు మరింత సమర్థవంతంగా పోలీసింగ్ చేయడానికి చేపట్టాల్సిన విధానాలను వివరించారు. ఈ ఏడాది కాలంలో నగరంలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్‌లపై ఆయా అధికారులతో విశ్లేషించిన ఆయన ఉత్తమ పోలీసింగ్ కోసం వచ్చే సంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలను విశదీకరించారు. సమావేశంలో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ బి.శ్రీనివాసరావు, డీటీసీ జి.సి.రాజారత్నం, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, ఎస్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాత్ రంజన్, డీఈవో కె.చంద్రకళ, సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి గోవాడ సుగర్స్ రెగ్యులర్ క్రషింగ్

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఈ ఏడాది రెగ్యులర్ క్రషింగ్‌ను గురువారం నుంచి ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు యార్డును శుభ్రం చేయడంతోపాటు చెరకు కాటాలను సిద్ధం చేశారు. ఈ ఏడాది 2లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే పక్వానికి వచ్చిన చెరకు తోటల్లో రసనాణ్యత పరీక్షలు నిర్వహించడంతో పాటు చెరకు కటింగ్ పర్మిట్లు కూడా ఫీల్డు సిబ్బంది ద్వారా రైతులకు అందించడం ప్రారంభించారు. మరో పక్క చెరకు రైతులకు గత సీజన్‌కు సంబంధించిన బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. రైతుల బకాయిలు, కార్మికుల జీతాలు చెల్లించేందుకు రూ. 13.40 కోట్లు గ్రాంటు రూపంలో ఇవ్వడానికి నిర్ణయించింది. బుధవారం తాజాగా బడ్జెట్ రిలీజ్ ఆర్డర్‌ను విడుదల చేసింది. బీఆర్‌వో రావడంతో గ్రాంటు రూపంలో వచ్చే నిధులు త్వరలో ఫ్యాక్టరీ ఖాతాలోకి త్వరలో జమ కానున్నాయి.

'పీఎఫ్ అదాలత్' తో తక్షణ పరిష్కారం

మురళీనగర్: నిధి ఆప్ కే నికట్ (పీఎఫ్ అదాలత్) ద్వారా సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం కుదురుతుందని ఈపీఎఫ్ విశాఖ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.రామకృష్ణ తెలిపారు. పీఎఫ్ ఖాతాదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిర్లా కూడలి లక్ష్మీ హ్యుందయ్‌లో బుధవారం నిర్వహించిన పీఎఫ్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా 27న జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆ రోజు సెలవు అయితే తర్వాత రోజు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇందులో ఖాతాదారులు పీఎఫ్ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు ఇవ్వవచ్చని చెప్పారు. వారం రోజుల ముందుగానే వేదిక వివరాలు తెలుపుతామని, విశాఖపట్నం రీజినల్ కార్యాలయం నోటీస్ బోర్డులో వివరాలు ప్రదర్శిస్తామని తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి 12 దరఖాస్తులు రాగా 11 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్ టి.నాగేశ్వరరావు, సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్ ఎస్.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. తదుపరి కార్యక్రమాన్ని జనవరి 27న నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్‌ఫోర్సుమెంటు ఆఫీసర్ రామకృష్ణ

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘనస్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న జేసీ విశ్వనాథన్

తాటిచెట్లపాలెం: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ బుధవారం వేకువజామున విశాఖపట్నం చేరుకున్నారు. రైలు మార్గం ద్వారా విశాఖ చేరుకున్న ఆయనకు జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు కుమారాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధి పనులు వేగవంతం

ఎస్ఎంఐ డీఈఈ జగదీష్



ముంచంగిపుట్టులో చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో అంబేడ్కర్ పార్క్ పక్కన ఉన్న చెరువు అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడతామని ఎస్ఎంఐ (సర్ఫేస్ మైనర్ ఇరిగేషన్) డీఈఈ జగదీష్ అన్నారు. చెరువు అభివృద్ధి నిమిత్తం జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర జెడ్పీ నిధులు రూ.20లక్షలు కేటాయించడంతో బుధవారం ఎస్ఎంఐ, పీఆర్, ట్రైబల్ వెల్ఫేర్, ఎన్ఆర్ఈజీఎస్ శాఖాల అధికారులు చెరువును పరిశీలించారు. చెయాల్సిన పనులపై చర్చించారు. జంగిల్ క్లియెన్స్, పూడిక తీత పనులు వేగంగా చెయాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎంఐ డీఈఈ జగదీష్ మాట్లాడుతూ జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర ఆదేశాలతో చెరువు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు , విడతల వారీగా పనులు చేయనున్నట్టు తెలిపారు. అన్ని ఇంజినీరింగ్ శాఖాల అధికారుల సమన్వయంతో పనులు సకాలంలో పూర్తి చేస్తామన్నారు. మూడు నెలల్లో పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పీఆర్ డిఈఈ రామమ్, ఎస్ఎంఐ ఏఈ త్రినాథ్, ఎంపీడీవో కిరణ్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈఈ జబ్బార్, హౌసింగ్ ఏఈఈ కృష్ణారావు, సర్పంచ్ సుభాష్‌చంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఢీకొన్న కార్లు.. స్తంభించిన ట్రాఫిక్



స్తంభించిన ట్రాఫిక్



దెబ్బతిన్న వాహనాలు

మధురవాడ: జాతీయ రహదారిపై కొమ్మాది జంక్షన్ వద్ద బుధవారం ఉదయం ఓ గ్యాస్ ట్యాంక్ సహా మూడు కార్లు వరసగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఓ కారు డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. బుధవారం ఉదయం 6.15 గంటల సమయంలో కొమ్మాది సిగ్నల్ వద్ద విశాఖ నుంచి మారికవలస వైపు వాహనాలు వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం సంభవించింది. వివరాలివీ.. సిగ్నల్ వద్ద ఓ ఆర్టీసీ బస్సు ఆగి ఉంది. దాని వెనకనే ఉన్న కారు డ్రైవర్ బ్రేక్ బదులు యాక్సిలరేటర్ తొక్కడంతో ముందు ఉన్న బస్సును స్వల్పంగా ఢీకొట్టాడు. ఆ సమయంలో వెనకే ఉన్న కారు ఈ ముందున్న కారును ఢీకొట్టింది. ఆ కారును తప్పించే క్రమంలో పక్కనే ఉన్న గ్యాస్ ట్యాంకర్‌ను మరో కారు స్వల్పంగా ఢీకొంది. మూడు కార్లు స్వల్పంగా దెబ్బతినడం తప్పితే ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

29న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 29న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. ఆర్ఎస్ టెక్నాలజీస్, హెటిరో డ్రగ్స్, ఎంఎఎస్ మెరైన్ సర్వీసెస్, ఇ-జోస్ సెక్యూరిటీ, డెక్కన్ ఫైన్ కెమికల్స్, ల్యాండ్ మార్క్ గ్రూప్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ ట్రెండ్స్, పేటీఎం, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 1,936 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. సాఫ్ట్‌వేర్ డెవలపర్, జూనియర్ కెమిస్ట్, పోర్ట్ సర్వేయర్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, రిటైల్ ట్రైనింగ్ అసోసియేట్, ఫార్మాసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, టెలికాలర్, అసిస్టెంట్, రికవరీ క్లర్క్స్, బ్రాంచ్ ఇన్‌చార్జి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ చేసిన వారు అర్హులు. 18–35 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.15,000 నుంచి రూ.45,000 వరకు ఉంటుందన్నారు. శుక్రవారం 10 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని సుబ్బిరెడ్డి చెప్పారు.

ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్‌గా ప్రదీప్ పటేల్

తగరపువలస: భీమిలిలోని తూర్పుతీర నేవల్ స్టేషన్ కళింగ కమాండింగ్ ఆఫీసర్‌గా ప్రదీప్ పటేల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రదీప్ పటేల్ 1996లో నేవీలో ప్రవేశించి తూర్పు, పశ్చిమ తీర నేవల్ కమాండింగ్ పరిధిలోని వార్‌షిప్‌లలో విధులు నిర్వర్తించారు. పశ్చిమ తీరంలో ఫ్లీట్ ఎలక్ట్రికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. 2003లో నేవల్ స్టాఫ్ చీఫ్‌గా, 2001, 2008లో ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌గా, ఐఎన్ఎస్ త్రిఖండ్‌లో వెపన్ సిస్టమ్‌లో ఎలక్ట్రికల్ ఆఫీసర్ విధులు నిర్వర్తించారు. కమాండర్ సీఎస్ నాయర్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నేషనల్ బాక్సింగ్ పోటీలకు గురుకుల విద్యార్థిని



బాక్సింగ్ క్రీడాకారిణి లక్ష్మీ తేజస్వినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరి

నర్సీపట్నం: నేషనల్ బాక్సింగ్ పోటీలకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యార్థిని ఏడిద లక్ష్మీ తేజస్విని ఎంపికైంది. ఇటీవల విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో తేజస్విని పాల్గొంది. 81 కిలోల విభాగంలో రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 30 నుంచి జనవరి 6వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో తేజస్విని పాల్గొననుంది. మెడల్ సాధించిన క్రీడాకారిణిని, తర్ఫీదు ఇచ్చిన పీడీ ఎస్.సాయిని ప్రిన్సిపల్ రాజేశ్వరి అభినందించారు. ప్రముఖ వ్యాపారి వెలగా నారాయణరావు బాక్సింగ్ గ్లౌజ్ కిట్‌ను తేజస్వినికి బహూకరించారు.

'మాస్టర్స్ అథ్లెటిక్స్'లో మెరిసిన విశాఖ వాసులు



ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచిన విశాఖ క్రీడాకారులు

మురళీనగర్: ప్రకాశం జిల్లా రామయ్యపట్నం పోర్ట్ సమీపంలోని చర్చి గ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన 43వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగర క్రీడాకారులు సత్తా చాటారు. రాష్ట్ర కార్యదర్శి మంగా ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో మురళీనగర్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎల్వీ సుధాకర్ 200మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, 100మీటర్లలో ద్వితీయ స్థానం సాధించారు. 5 కిలోమీటర్ల వాకింగ్‌లో స్వర్ణ పతకం, 400 మీటర్లు రిలేలో కాంస్య పతకం, హ్యామర్ త్రోలో రజతం సాధించారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.రామారావు 5 కి.మీ వాకింగ్‌లో రజతం సాధించారు.

పోలీస్ శాఖ క్రీడాకారులకు పతకాల పంట

పోలీసు శాఖకు చెందిన ఐదుగురు క్రీడాకారులు పలు పతకాలు సాధించారు. ఎస్.జలు ఉష షాట్‌పుట్‌లో స్వర్ణ పతకం, జావెలిన్ త్రోలో స్వర్ణ పతకం, డిస్కస్ త్రోలో స్వర్ణ పతకం, 400మీ. రిలేలో కాంస్యం సాధించారు. కె.సీతామహలక్ష్మి 5కి.మీ వాకింగ్‌లో స్వర్ణం, హ్యామర్ త్రోలో స్వర్ణం, డిస్కస్ త్రోలో రజతం గెలుచుకున్నారు. ఎం.బాలరాజు లాంగ్‌జంప్‌లో స్వర్ణం, 200మీ. రన్నింగ్‌లో రజతం, ట్రిపుల్ జంప్‌లో కాంస్యం, సీహెచ్ సంతోష్ షాట్‌పుట్‌లో స్వర్ణం, 800మీ.రన్నింగ్‌లో రజతం, జావెలిన్ త్రోలో స్వర్ణం, టి.సుధాకర్ 400మీ రన్నింగ్‌లో స్వర్ణం, 100మీ.లో రజతం, డిస్కస్‌తో రజతం సాధించారు. డి.సరోజిని 5 కి.మీ. వాక్‌లో స్వర్ణం, 100మీ. విభాగంలో స్వర్ణం, 800 మీటర్ల విభాగంలో కాంస్యం గెలుచుకున్నారు. ఆర్.విమల షాట్‌పుట్‌లో రజతం, 5కే రన్నింగ్‌లో బంగారం, జావెలిన్ త్రోలో రజతం, వీరభద్రరావు హేమర్ త్రోలో బంగారం, డిస్కస్ త్రోలో రజతం, షాట్‌పుట్‌లో రజతం సొంతం చేసుకున్నారు. టీడీ శశి డిస్కస్ త్రోలో స్వర్ణం, హ్యామర్‌త్రో రజతం, ఎం.భాస్కర్ షాట్‌పుట్ స్వర్ణం, జావెలిన్ త్రోలో స్వర్ణం, డి.సూరిబాబు లాంగ్ జంప్‌లో స్వర్ణం, ఎం.సత్యారావు 5కి.మీ వాకింగ్‌లో ద్వితీయ స్థానం, 400మీ రన్‌లో రజతం సాధించారు.

విలువలతో కూడిన విద్య అవసరం

గవర్నర్ అబ్దుల్ నజీర్ సతీమణి సమీరా నజీర్



విశాఖ వేలీ స్కూల్‌లో మాట్లాడుతున్న గవర్నర్ సతీమణి సమీరా నజీర్



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సతీమణి సమీరా నజీర్ తెలిపారు. విశాఖ వేలీ స్కూల్‌ను ఆమె జిల్లా కలెక్టర్ మల్లికార్జున సతీమణి డాక్టర్ నిహారిక, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సతీమణి డాక్టర్ పృథ్వితో కలసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సమీరా నజీర్ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిని కాపాడే విధంగా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. విద్యార్థులు పుస్తకాల ద్వారా ప్రాచీన భారతదేశ చరిత్ర తెలుసుకోవచ్చన్నారు. దేశ గౌరవాన్ని నిలబెట్టే పరిజ్ఞానం అందరికీ అవసరమన్నారు. విద్యార్థులు చదువు మీద శ్రద్ధ పెట్టాలన్నారు. సెల్‌ఫోన్లు, యూ ట్యూబ్‌లు, ట్విట్టర్ చూడవద్దని ఆమె సూచించారు. చదువు అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా విజ్ఞానం సంపాదించాలనే ఆలోచనతో ఉండాలన్నారు. చదువు ఆర్థిక పరిస్థితిలో మార్పు తీసుకొస్తుందన్నారు. భారతదేశంలో వర్సిటీలు విజ్ఞానం అందించడంలో ప్రపంచ వర్సిటీలతో పోటీ పడుతున్నాయన్నారు. అనంతరం కలెక్టర్ సతీమణి, నిహారిక, జీవీఎంసీ కమిషనర్ సతీమణి పృధ్వి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. క్రమశిక్షణ మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందన్నారు. ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ పాఠశాల సాధించిన విజయాలు, పాఠశాల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చేస్తున్న కృషి గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేయడంతోపాటు పాటలు పాడి అలరించారు.